
క్లుప్తంగా

రాష్ట్రస్థాయి క్రీడల్లో ప్రతిభ



తొర్రూరు: ఎస్‌జీఎఫ్‌ఐ రాష్ట్రస్థాయి క్రీడల్లో స్థానిక సిద్ధార్థ హైస్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. తాజాగా కేసముద్రంలో జరిగిన ఎస్‌జీఎఫ్‌ఐ క్రీడల్లో భాగంగా నిర్వహించిన వూషూ చాంపియన్‌షిప్ పోటీల్లో విద్యార్థులు అండర్–19 విభాగంలో 65కిలోల విభాగంలో తలపడిన శ్రీనాథ్, మధు రజత పతకాలను సాధించారు. పాఠశాల చైర్మన్ ముత్తినేని సోమేశ్వర్‌రావు, కరస్పాండెంట్ ముత్తినేని జయప్రకాష్ అభినందించారు.


చెక్కుల పంపిణీ

బయ్యారం: రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకారుల ఆర్థికాభివృద్ధి కోసం సరఫరా చేసిన ఉచిత చేపపిల్లలను సోమవారం ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య బయ్యారం పెద్దచెరువులో పంపిణీ చేశారు. మండలంలోని కోటగడ్డలో ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ను ప్రారంభించారు. బయ్యారంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే లబ్ధిదారులకు పంపిణీ చేశారు.

నిందితులను శిక్షించాలి

నెహ్రూసెంటర్: కోల్‌కతాలో డాక్టర్‌పై జరిగిన ఘటనపై నిందితులను కఠినంగా శిక్షించి, సత్వర న్యాయం చేయాలని పీఓడబ్ల్యూ జిల్లా కార్యదర్శి ఊకే పద్మ డిమాండ్ చేశారు. మహిళా డాక్టర్‌పై జరిగిన ఘటనపై సోమవారం జిల్లా కేంద్రంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షురాలు తిరుపతమ్మ, భిన్నమ్మ, అనురాధ, రమ, ఉపేంద్ర, సోయమ్మ, సోమక్క పాల్గొన్నారు.

ఆర్టీసీని ఆదరించాలి



నెహ్రూసెంటర్: ప్రజలందరూ ఆర్టీసీని ఆదరించి ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణించాలని డిపో మేనేజర్ ఎం.శివప్రసాద్ అన్నారు. వివిధ ప్రాంతాలకు వెళ్లే ఆర్టీసీ బస్సుల సమయ సూచిక కార్డులను గర్భగుడి తల్లి పిల్లల ఆస్పత్రి వైద్యుడు డాక్టర్ నేతావత్ వెంకన్న సోమవారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా డీఎం మాట్లాడుతూ.. ప్రయాణికులు ఈ కార్డుల ద్వారా బస్సుల సమయాల సూచిక ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఉద్యోగులు శ్రీనివాస్, ఏడీసీలు, ఉద్యోగస్తులు, ప్రయాణికులు పాల్గొన్నారు.

టై, బెల్టుల పంపిణీ



తొర్రూరు రూరల్: మండలంలోని మాటేడు ప్రభుత్వ పాఠశాలకు చెందిన విద్యార్థులకు లయన్స్ క్లబ్ కనకదుర్గ హన్మకొండ వారి ఆధ్వర్యంలో టై, బెల్టులను సోమవారం పంపిణీ చేశారు. క్లబ్ కోశాధికారి, ప్రభుత్వ ఉపాధ్యాయురాలు శోభా భిక్షపతి సుమారు రూ.10వేల విలువ చేసే వస్తువులను విద్యార్థులకు అందించి మానవత్వాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో హెచ్ఎం కొండేటి ప్రభాకర్, కనకదుర్గ క్లబ్ అధ్యక్షురాలు ఉమాదేవి, క్లబ్ ప్రతినిధులు సులోచన, శోభ, ఏలిషా పాల్గొన్నారు.

పోరాట ఫలితమే మెస్‌చార్జీల పెంపు

మహబూబాబాద్ అర్బన్: తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పీడీఎస్‌యూ వివిధ విద్యార్థి సంఘాల పోరాటాల ఫలితమే వసతి గృహాల్లో, గురుకుల పాఠశాలలో మెస్‌చార్జీలు పెంచారని పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి బోట్ల గౌతం అన్నారు. జిల్లా కేంద్రంలో సోమవారం ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఉదయ్, నందీశ్వర్, రామ్‌చరణ్, కార్తీక్ పాల్గొన్నారు.

కులగణనపై ఎన్యూమరేటర్లకు శిక్షణ

తొర్రూరు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే పక్కాగా చేపట్టాలని తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ నర్సింగరావులు కోరారు. సమగ్ర కుటుంబ సర్వేపై డివిజన్ కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎన్యుమరేటర్లకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈనెల 6నుంచి మొదలయ్యే సర్వేలో తప్పులకు ఆస్కారం ఇవ్వొద్దన్నారు. ఈ సమావేశంలో ఎంఈఓ మహంకాళి బుచ్చయ్య, ఎంపీఓ పూర్ణచందర్, సిబ్బంది పాల్గొన్నారు.

గార్ల: ఈనెల 6నుంచి ప్రారంభమయ్యే సమగ్ర కులగణన ఇంటింటి సర్వే పకడ్బందీగా నిర్వహించాలని తహసీల్దార్ రవీందర్ ఎన్యుమరేటర్లను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంఈఓ మంకిడి వీరభద్రం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నెల్లికుదురు: సర్వేను సమగ్రంగా నిర్వహించాలని ఎంపీడీఓ బాలరాజు, ఎంఈఓ రాందాస్ ఎన్యుమరేటర్లకు సూచించారు.

డోర్నకల్: కులగణనలో పాల్గొంటున్న ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లకు సోమవారం తహసీల్దారు, ఎంపీడీఓ కార్యాలయాల్లో వేర్వేరుగా శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటస్వామి, ఎంపీడీఓ శ్రీనివాస నాయక్, ఎంఈఓ లక్ష్మానాయక్, ఏపీఎం శంకర్ నాయక్ పాల్గొన్నారు.



గార్ల: రైతువేదికలో శిక్షణ ఇస్తున్న అధికారులు

దంతాలపల్లి: ఇంటింటా సర్వేను జాగ్రత్తగా నిర్వహించాలని తహసీల్దారు కాటం చంద్రరాజేశ్వర్, ఎంపీడీఓ వివేక్‌రామ్ అన్నారు. సోమవారం మండలకేంద్రంలోని రైతువేదికలో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌ను ఇన్యుమరేటర్లతో కలిసి వీక్షించారు.

కురవి: కుటుంబ సర్వే కార్యక్రమంలో భాగంగా మండలంలోని గుండ్రాతిమడుగు(విలేజి)లోని రైతువేదికలో సోమవారం కురవి, సీరోలు మండలాలకు చెందిన ఎన్యుమరేటర్లకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్లు సునీల్‌రెడ్డి, శారద, ఈజీఎస్ఏపీఓ యాకాంబ్రం, ఎంఈఓ బాలాజీ, తదితరులు పాల్గొన్నారు.



కురవి: శిక్షణలో పాల్గొన్న ఎన్యుమరేటర్లు

కేసముద్రం/కొత్తగూడ: మండల కేంద్రంలో కుటుంబ సర్వేపై సోమవారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ ఉదయశ్రీ, ఇన్‌చార్జ్ ఎంఈఓ యాదగిరి, డీటీ ఎర్రయ్య, కొత్తగూడ తహసీల్దార్ రమాదేవి, ఎంపీడీఓ రవీంద్రప్రసాద్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కార్తీకమాస పూజలు

మహబూబాబాద్ రూరల్/దంతాలపల్లి/డోర్నకల్: శివకేశవులకు అత్యంత ప్రీతికరమైన కార్తీక మాస మొదటి సోమవారం సందర్భంగా జిల్లా కేంద్రంలోని ఆలయాల్లో భక్తులు స్వామివార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని కంబాలపల్లి సుప్రసిద్ధ శ్రీరాజరాజేశ్వర స్వామివారి దేవాలయంలో స్వామివారికి ఆలయ అర్చకులు అనుగోజు లోకేశ్వరాచార్యులు విశేషంగా భస్మాభిషేకం నిర్వహించారు.



మహబూబాబాద్ రూరల్: రామలింగేశ్వరాలయంలో పూజలో పాల్గొన్న భక్తులు

ప్రతిభను వెలికితీసేందుకే ‘చెకుముకి’



చిన్నగూడూరు: పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు

చిన్నగూడూరు: పాఠశాల స్థాయిలో విద్యార్థుల ప్రతిభను విలికి తీసేందుకే చెకుముకి టాలెంట్ టెస్టు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రవికుమార్ తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో జన విజ్ఞానవేదిక మండలశాఖ అధ్యక్షుడు జిక్కి నాగేశ్వరరావు అధ్యక్షతన మధ్యాహ్న భోజన విరామ సమయంలో చెకుముకి పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. 8,9,10వ తరగతి విద్యార్థులు జనవిజ్ఞాన ఆధ్వర్యంలో ఈనెల 7న జరిగే చెకుముకి పోటీలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కమిటీ బాధ్యులు జంపాల చక్రధర్, జినుకల వెంకాట్రామనర్సయ్య, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

డోర్నకల్: స్థానిక జెడ్పీహెచ్ఎస్‌లో సోమవారం చెకుముకి సైన్స్ సంబురాలు–2024కు సంబంధించిన ప్రచార పోస్టర్‌ను ఎంఈఓ ఆంగోత్ లక్ష్మా ఆవిష్కరించారు. ఈసందర్భంగా జనవిజ్ఞాన వేదిక మండల అధ్యక్షుడు కోవెల రాజేశ్వర్ మాట్లాడుతూ.. బాలబాలికల్లో విద్య, వికాసం, విజ్ఞానం పెంపొందించేందుకు పాఠశాల, మండల, జిల్లా, రాష్ట్రస్థాయి ప్రతిభా పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం బండి నర్సింహారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కేసముద్రం: మండల కేంద్రంలోని జెడ్పీహైస్కూల్‌లో ఈనెల 21న జనవిజ్ఞాన వేదిక మండల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్న చెకుముకి టాలెంట్ టెస్ట్‌కు సంబంధించిన పోస్టర్లను సోమవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు చిర్ర యాకాంతంగౌడ్, సంఘం కార్యదర్శి బండారు నరేందర్, మోహనకృష్ణ, నర్సింహరాజు, చందర్ పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలి

ఎమ్మెల్యే రాంచంద్రునాయక్

దంతాలపల్లి: గ్రామాల్లోని ప్రజలకు, రైతులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని ఎమ్మెల్యే రాంచంద్రునాయక్ అన్నారు. మండల కేంద్రంలోని బాలాజీ ఫంక్షన్ హాలులో సోమవారం నిర్వహించిన విద్యుత్ అధికారుల సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలకు, రైతులకు విద్యుత్ సరఫరాలో ఏ సమస్య ఉన్న సంబంధిత అధికారులు వెంటనే స్పందించి వారి సమస్యలు పరిష్కరించాలన్నారు. ప్రభుత్వం ప్రవేశ పెట్టిన రూ.940కే విద్యుత్ మీటర్‌పై అవగాహన కల్పించాలన్నారు. పొలం బాట నిర్వహించే క్రమంలో అధిక లోడు ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లను గుర్తించి రైతులకు ఇబ్బంది లేకుండా వెంటనే మరో ట్రాన్స్‌ఫార్మరం ఇవ్వాలని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎస్ఈ నరేష్, డీఈ మధుసూదన్, మంగళంపల్లి ప్రవీణ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాంచంద్రునాయక్

సభ్యత్వ నమోదు

కురవి: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకిచ్చిన గ్యారంటీలను గాలికొదిలేసిందని బీజేపీ జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి, సెంట్రల్ ఫిలిం సెన్సార్ ప్యానల్ బోర్డ్ మెంబర్ చీకటి మహేష్‌గౌడ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో బీజేపీ సభ్యత్వ నమోదు నిర్వహించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు శ్రీరామోజు నాగరాజు, కొణతం పెంటయ్య, పూర్ణచందర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

వీఓఏల సమస్యలు పరిష్కరించాలి

నెల్లికుదురు: మయూరి మండల సమాఖ్య ఆధ్వర్యంలో పనిచేస్తున్న వీఓఏల పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని సంఘం మండల అధ్యక్షుడు హనమంతు, కార్యదర్శి రాధిక ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఏపీఎం వరదయ్యకు వినతిపత్రం అందించారు. ఈనెల 12న కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో వీఓఏలు విజయ, శ్రీమణి, శ్వేత పాల్గొన్నారు.

ఆర్‌ఓసీ నంబర్‌ను ఉపసంహరించాలి

మహబూబాబాద్ అర్బన్: ప్రభుత్వ భూముల్లో ఎన్నో ఏళ్లుగా ఇళ్లు నిర్మించుకొని ఉంటున్న పేదలకు ఇంటి నంబర్ల నిలుపుదల చేసే జీఓ నంబర్‌ను ఆర్‌ఓసీని వెంటనే ఉపసంహరించాలని సీపీఐ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ బి.అజయ్‌సారథి రెడ్డి అన్నారు. సోమవారం అడిషనల్ కలెక్టర్ లెలిన్ వత్సల్ టొప్పోకు వినతిపత్రం అందజేశారు.


అధిక సాంద్రత పత్తిసాగుతో లాభాలు



మాట్లాడుతున్న మాలతి

కేసముద్రం: ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, కేవీకే మల్యాల ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని కోరుకొండపల్లి గ్రామంలో అధిక సాంద్రత పత్తి సాగుపై క్షేత్ర దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఎస్.మాలతి మాట్లాడుతూ.. అధిక సాంద్రత పత్తిసాగు ద్వారా మొక్కల సంఖ్య 20వేల వరకు ఉంటుందన్నారు. ఒకేసారి పత్తితీతతో నాణ్యత బాగుంటుందన్నారు. మొత్తంగా 12 నుంచి 13 క్వింటాళ్ల దిగుబడి సాధించవచ్చన్నారు. అధిక సాంద్రత పత్తిసాగులో డిసెంబర్ తర్వాత పత్తి అనంతరం మొక్కజొన్న, పెసర, మినుము సాగు చేసుకోవచ్చని ఆమె తెలిపారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త కిశోర్‌కుమార్, 60 మంది రైతులు పాల్గొన్నారు.

ఎస్‌జీటీ అవకాశం కల్పించాలి



నిరసన తెలుపుతున్న బీఈడీ అభ్యర్థులు

తొర్రూరు: బీఈడీ కోర్సు చేసే అభ్యర్థులకు డీఎస్సీ రాసే అవకాశం కల్పించాలని అభ్యర్థులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం డివిజన్ కేంద్రంలో బీఈడీ అభ్యర్థులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం బస్టాండ్ సెంటర్‌లో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీఈడీ అభ్యర్థులకు డీఎస్సీలో ఎస్‌జీటీకి అవకాశం కల్పించాలని, స్కూల్ అసిస్టెంట్ పోస్టులను డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారానే భర్తీ చేయాలన్నారు. ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసి డీఎస్సీకి అర్హత కల్పించాలని కోరారు. నిరసనలో రమేష్, అశోక్, సతీష్, జ్యోతి, సరిత, వనిత, స్వాతి, రమ, తదితరులు పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలతో నిరసన

మహబూబాబాద్ అర్బన్: కలెక్టర్ తీరును నిరసిస్తూ మానుకోట జర్నలిస్టులు నల్లబ్యాడ్జీలు ధరించి ప్లకార్డులతో సోమవారం కలెక్టర్ కార్యాలయం ప్రాంగణంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జర్నలిస్టులు బాల్నే సుమన్, తౌకల రామచంద్రు మాట్లాడుతూ.. 239 జీఓ కోర్టు తీర్పును పట్టించుకోవడం లేదని, అక్రిడిటేషన్ కార్డులు అడిగిన క్రమంలో 15రోజుల అంటూ పరిశీలిస్తామంటూ రోజులు గడుపుతున్నారన్నారు. కార్యక్రమంలో గట్టు కిరణ్, శివరామకృష్ణ పాల్గొన్నారు.

క్రీస్తు బోధనలు అనుసరణీయం

మహబూబాబాద్ రూరల్: క్రీస్తు బోధనలు అనుసరణీయమని, ఆధ్యాత్మిక చింతన మంచి మార్గంలో నడిపిస్తుందని ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు జిల్లా పాస్టర్స్ లే లీడర్స్ ఫెలోషిప్ (ఎండీపీఎల్ఎఫ్) ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు పాస్టర్ కుమారస్వామి అధ్యక్షతన సంఘం ఐదో వార్షికోత్సవ వేడుకలు స్థానిక షారోన్ చర్చిలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే, ఎండీపీఎల్ఎఫ్ ఫౌండర్ బిషప్ మల్లెపాక తిమోతి, ఏఐసీఎఫ్ ఫౌండర్ గద్దపాటి విజయరాజు హాజరయ్యారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మురళీనాయక్ మాట్లాడారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ వెంకన్న, పాస్టర్ పి.సంపత్ కుమార్, ఎండీపీఎల్ఎఫ్ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మురళీనాయక్

అమరుల ఆశయ సాధనకు ఉద్యమించాలి



గూడూరు: మాట్లాడుతున్న అనురాధ

గూడూరు: అమరుల ఆశయ సాధనకు ప్రతీ ఒక్కరు ఉద్యమించాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమాక్రసీ రాష్ట్ర నాయకురాలు అనురాధ పిలుపునిచ్చారు. అమర వీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా మండలంలోని మచ్చర్లలో రాసూరి యాకన్న స్మారక బహిరంగ సభ గజ్జి లింగన్న అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి గౌని ఐలయ్య, రాష్ట్ర నాయకులు వెంకన్న, ఐలయ్య, వెంకటేశ్వర్లు, అచ్చన్న, నర్సయ్య, వెంకన్న, అరుణోదయ కళాకారులు పాల్గొన్నారు.

బయ్యారం: అమరుల త్యాగాలు విప్లవోద్యమంలో మరవలేనివని మాస్‌లైన్(ప్రజాపంథా) డివిజన్ కార్యదర్శి జగ్గన్న, మండల కార్యదర్శి బిల్లకంటి సూర్యం అన్నారు.

పెద్దవంగర: అమరుల ఆశయాలను కొనసాగిద్దామని సీపీఎంఎల్ న్యూడెమోక్రసీ డివిజన్ నాయకులు యాకుబ్ అన్నారు. అమరవీరుల సంస్మరణ వారోత్సావాల్లో భాగంగా సోమవారం మండల కేంద్రంలోని వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు.

సంక్షిప్త సమాచారం

నష్టపరిహారం చెల్లించాలి

బయ్యారం: వానాకాలంలో వచ్చిన వరదలతో పంటనష్టపోయిన రైతులకు వెంటనే డబ్బులు చెల్లించాలని సీపీఎం మండల కార్యదర్శి నంబూరి మధు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాడు. సోమవారం ఆయన మాట్లాడారు.

సీపీఎం మండల కార్యదర్శిగా యాకుబ్

తొర్రూరు రూరల్: సీపీఎం మండల కార్యదర్శిగా రెండోసారి మండలంలోని కంఠాయపాలెం గ్రామానికి చెందిన ఎండీ యాకుబ్‌ను పార్టీ మండల మహాసభలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు పార్టీ జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ సోమవారం తెలిపాడు.

ఎంఈఓకు వినతి

నెల్లికుదురు: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సమగ్ర సర్వే నిర్వహణకు తక్కువ పిల్లలున్న పాఠశాలల ఉపాధ్యాయులను ఎన్యుమరేటర్లుగా ఎంపిక చేసి రెండు పూటల బడులు నిర్వహించే విధంగా చర్య తీసుకోవాలని టీపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎండీ సైదులు పాషా, డీటీఎఫ్ జిల్లా కౌన్సిలర్ పెరుమాండ్ల యాదగిరి ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ఎంపీడీఓ బాలరాజు, ఎంఈఓ రాందాస్‌కు సోమవారం వినతిపత్రం అందించారు.

కోతకు వచ్చిన వరిని మాత్రమే కొయ్యాలి

తొర్రూరు రూరల్: పగలు, రాత్రి తేడా లేకుండా ఎంతో కష్టపడి సాగు చేసిన వరి పంట కోతకు వస్తేనే కొయ్యాలని మండల వ్యవసాయశాఖ అధికారి భాస్కర్ కోరారు. సోమవారం మండలంలోని నాంచారీమడూరు, వెలికట్ట గ్రామాల శివారుల్లో వరిపంటలను పరిశీలించారు.

ఎస్పీని కలిసిన జిల్లా కోర్టు పీపీ

మహబూబాబాద్ రూరల్ : జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ ను జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్, సెషన్స్ కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటరు చిలుకమారి వెంకటేశ్వర్లు సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి బొకే అందజేశారు.

డైట్ చార్జీలు పెంచడం అభినందనీయం

కురవి: కాంగ్రెస్ ప్రభుత్వం డైట్ చార్జీలను పెంచిందని, దీంతో పేద విద్యార్థులకు లాభం జరిగిందని కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి రజనీకాంత్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం సంక్షేమ హాస్టళ్లలో డైట్, కాస్మోటిక్ చార్జీలు పెంచడం అభినందనీయమన్నారు.

ఓటు హక్కు నమోదు చేసుకోవాలి

మహబూబాబాద్ అర్బన్: 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు నమోదు చేసుకోవాలని డీఆర్డీఏ ఏపీఎం అశోక్‌పాల్ అన్నారు. జిల్లా కేంద్రంలోని నలంద డిగ్రీ కళాశాలలో ఓటు నమోదుపై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వై. కృష్ణప్రసాద్, అధ్యాపకులు పాల్గొన్నారు.

పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన



కురవి: మండలంలోని అయ్యగారిపల్లి గ్రామంలో పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం సోమవారం అత్యంత భక్తిశ్రద్ధలతో కిసాన్ పరివార్ సంస్థ సీఈఓ డాక్టర్ వివేక్ దంపతులు పూజలు పాల్గొన్నారు. వివేక్ రూ.40వేల ఆర్థిక సాయం అందించారు.

వేతన బకాయిలు విడుదల చేయాలి

నెహ్రూసెంటర్: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న గ్రామ పంచాయతీ కార్మికుల వేతన బకాయిలను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ ప్రగతిశీల గ్రామ పంచాయితీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కొత్తపల్లి రవి సోమవారం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాడు.

బాలుడికి కౌన్సెలింగ్

నర్సింహులపేట: మండలంలోని జయపురం శివార దాసుతండాకు చెందిన బాలుడు బడికి వెళ్లకుండా చెడు వ్యసనాలకు తిరుగుతున్నాడని సోమవారం చైల్డ్ హెల్ప్‌లైన్ సంస్థ సూపర్‌వైజర్ కల్యాణి కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం బాలుడిని పాఠశాలలో రీ అడ్మిషన్ చేశారు.

పత్తి దగ్ధం

నర్సింహులపేట: మండల కేంద్రంలోని బొమ్మిశెట్టి వెంకన్నకు చెందిన సుమారు 5క్వింటాళ్లకు పైగా పత్తి దగ్ధమయింది. వివరాలు ఇలా ఉన్నాయి.. నర్సింహులపేటకు చెందిన వెంకన్న అనే రైతు తన ఇంటి ముందు పత్తిని ఆరబెట్టాడు. సోమవారం మధ్యాహ్నం ప్రమాదవశాత్తు పత్తి మంటల్లో కాలిపోయింది. రూ.50వేలకు పైగా నష్టం జరిగిందని బాధితుడు తెలిపాడు.

నిత్యావసరాల అందజేత

డోర్నకల్: మండలంలోని గొల్లచర్ల గ్రామంలో ఒంటరిగా జీవిస్తున్న వృద్ధురాలు రాములమ్మకు ఎస్పీ ఆదేశాల మేరకు సోమవారం సీఐ బి.రాజేష్, ఎస్సై వంశీధర్ బియ్యం, నిత్యావసర సరుకులతోపాటు కూరగాయలను అందించారు.

ఒకరి రిమాండ్

నర్సింహులపేట: వరకట్నం వేధింపుల కేసులో జయపురం శివారు దాసుతండాకు చెందిన గుగులోతు వెంకన్నను సోమవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్సై మాలోతు సురేష్ తెలిపారు. దాసుతండాకు చెందిన గుగులోతు శిరీష భర్త వెంకన్న నిత్యం అదనపు వరకట్నం కోసం వేధింపులకు గురిచేయడంతో నాలుగు రోజుల క్రితం శిరీష పురుగుల మందు తాగి మృతి చెందింది. అదనపు కట్నం కేసులో వెంకన్నను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్సై తెలిపారు.

విద్యార్థి అదృశ్యం



మహబూబాబాద్ రూరల్: విద్యార్థి అదృశ్యమైన ఘటనలో సదరు విద్యార్థి విద్యనభ్యసించే పాఠశాల వార్డెన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నామని మహబూబాబాద్ టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్ సోమవారం రాత్రి తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఏకశిల హైస్కూల్లో పదో తరగతి చదువుతున్న ఆంగోత్ గోపాల్ ఆదివారం రాత్రి 10 గంటల సమయంలో పాఠశాలలో తోటి విద్యార్థులతో కలిసి నిద్రించాడన్నారు. సోమవారం ఉదయం విద్యార్థులను వార్డెన్ నిద్ర లేపేందుకు వెళ్లగా గోపాల్ కనిపించకపోవడంతో అతడి ఆచూకీ కోసం గాలించారు. విద్యార్థి తల్లిదండ్రులకు ఫోన్ చేసి అడిగినప్పటికీ తమ వద్దకు రాలేదన్నారు. వార్డెన్ రామవరపు రాజశేఖర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపాడు.

క్రైం కార్నర్..

విద్యుత్ షాక్‌తో మహిళ మృతి



వినోద (ఫైల్)

నెల్లికుదురు: విద్యుత్ షాక్‌కు గురైన మహిళ మృతి చెందిన సంఘటన మండలంలోని మేచరాజుపల్లి శివారు కొత్త తండాలో సోమవారం చోటు చేసుకుంది. మృతురాలి కుటుంబ సభ్యులు, ఎస్సై చిర్ర రమేష్‌బాబు కథనం ప్రకారం.. కొత్తతండాకు చెందిన రమావత్ వినోద (35) దీపావళి పండుగకు తన తల్లి గ్రామమైన పడమటిగడ్డ తండాకు వెళ్లింది. సోమవారం ఇంట్లో శివునికి దీపం పెట్టి పూజ చేయాలని కొత్త తండాలోని సొంతింటికి వచ్చింది. ఈ క్రమంలో ఇంట్లోని రేకుల షెడ్డులోని తీగకు విద్యుత్ ప్రసారం కావడంతో విద్యుత్ షాక్ గురై వినోద మృతి చెందినట్లు తెలిపారు. మృతురాలి భర్త సంతోష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని పంచనామా నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు. మృతురాలికి కూతురు ఉంది. తండాలోని సింగిల్ ఫేజ్ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లో సమస్యలు ఉన్నాయని దీంతో ఇళ్లల్లో విద్యుత్ షాక్ వస్తుందని విద్యుత్ అధికారులకు సమాచారం ఇచ్చినా పట్టింపులేదని తండావాసులు ఆరోపిస్తున్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి..

గూడూరు: భార్య చనిపోయిందన్న బాధతో ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని రాజనపల్లిలో సోమవారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గద్దల శ్రీనివాస్ (45) భార్య గత సంవత్సరం క్రితం కిడ్నీ పాడై మృతి చెందింది. అప్పటి నుంచి భార్యపై మనోవేదన పెట్టుకున్న శ్రీనివాస్ అనారోగ్యానికి గురయ్యాడు. దీంతో వారంరోజుల క్రితం ఇంట్లోని పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు వెంటనే మానుకోట ఏరియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతిచెందాడు. వారికి ఇద్దరు కొడుకులు ఉండగా, పెద్ద కొడుకు కూలీ పనులు చేసుకుంటూ ఊళ్లో ఉండగా, చిన్న కొడుకు పోలీసు ఉద్యోగం చేస్తున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

గార్లలో ఒకరు..

గార్ల: భార్య పుట్టింటికి వెళ్లిపోవడంతో మద్యానికి బానిసై జీవితంపై విరక్తి చెంది ఓ వ్యక్తి పురుగు మందు తాగి చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందిన సంఘటన సర్వన్‌తండాలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. తండాకు చెందిన బానోత్ రామారావు (32) మద్యానికి బానిస కాగా భార్య పుట్టింటికి వెళ్లింది. భార్య లేదనే మనాదితో అతిగా మద్యం తాగేవాడు. జీవితంపై విరక్తి చెంది ఐదు రోజుల క్రితం రామారావు పురుగుమందు తాగాడు. స్థానికులు మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించిగా తెల్లవారుజామున మృతిచెందాడు. మృతుడి తండ్రి బానోత్ కస్నా ఫిర్యాదు మేరకు ఎస్సై జీనత్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గడ్డి మందు తాగి వృద్ధుడి..

పెద్దవంగర: మద్యం మత్తులో గడ్డమందు మందు తాగిన ఓ వృద్ధుడు మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలో సోమవారం చోటుచేసుకుంది. ఎస్సై క్రాంతికిరణ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన ఉడుత యాకయ్య (60) గొర్రెల పెంపకంతో జీవనం సాగిస్తున్నాడు. కొద్ది రోజులుగా మద్యానికి బానిసయ్యాడు. ఇంట్లో ఎవరు లేని సమయంలో మద్యం మత్తులో గడ్డిమందు తాగి అపస్మారకస్థితిలోకి వెళ్లాడు. గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందజేశారు. తొర్రూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య ఐలమ్మ, ఇద్దరు కూతుర్లు, కుమారుడు ఉన్నారు. కొడుకు లింగన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పారదర్శకంగా లబ్ధిదారులను ఎంపిక చేయాలి



గార్ల: ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో రాజకీయ పార్టీలకు అతీతంగా గ్రామ సభలు ఏర్పాటు చేసి పారదర్శకంగా ఎంపిక చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కందునూరి శ్రీనివాసరావు, సీపీఎం మండల కార్యదర్శి అలువాల సత్యవతి అన్నారు. సోమవారం పార్టీ కార్యాలయంలో వారు మాట్లాడారు. ఈనెల 6నుంచి నిర్వహించే సామాజిక ఆర్థిక సర్వేను అధికారులు సమగ్ర సమాచారం ప్రకారం నిర్వహించాలని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకున్న అర్హులందరికీ ఆసరా పింఛన్లు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో గడ్డిపాటి రాజారావు, ఈశ్వర్‌లింగం, అంబటి వీరస్వామి, ఇమ్మడి గోవింద్, నాగమణి, లోకేశ్వరరావు, మౌనిక, బాబు, తదితరులు పాల్గొన్నారు.